క్లుప్తంగా

'సమ్మె విజయవంతం చేయాలి'



సమ్మె నోటీస్ అందిస్తున్న కార్మికులు

కౌటాల: గిరిజన వసతి గృహాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 18 నుంచి సమ్మె చేస్తున్నట్లు కార్మికులు తెలిపారు. ఆదివారం మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో కార్మికులు హెచ్‌ఎం నాందేవ్‌కు సమ్మె నోటీస్ అందించారు. వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో పని చేస్తున్న కార్మికులకు పనికి తగిన వేతనం అందించాలన్నారు. ప్రభుత్వం ఈ నెల 17వ తేదీలోగా తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. లేకుంటే 18వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు సదాశివ్, సంతోష్, సంజీవ్, సుక్రు తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు ప్రారంభం



చేతిపంపు ప్రారంభిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: మండలంలోని ఈదులవాడ గ్రామ పంచాయతీ పరిధి కొమ్ముగూడలో కొత్తగా ఏర్పాటు చేసిన చేతిపంపును ఆదివారం ఎంపీపీ మల్లికార్జున్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుందని, మిగతా అవసరాల కోసం చేతిపంపు నీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, సర్పంచ్ భీమేశ్, నాయకులు గడ్డల సురేశ్, బుజిడి వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎల్‌అండ్‌టీ, ఎవరెస్ట్ కంపెనీ యాజమాన్యాలు స్పష్టమైన హామీలు ఇవ్వకుంటే సమ్మె ఉధృతం చేస్తామని మిషన్ భగీరథ కార్మికులు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మికులు చేపట్టిన సమ్మె 9వరోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఆదివారం మోకాళ్లపై నిల్చొని నిరసనలు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు అల్లూరి లోకేష్, దుర్గం లింగయ్య, బాలేశ్, సురేశ్, వెంకటేష్, తాజ్, శ్రీకాంత్, అనిల్, రవీందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎక్కాహం



ఎక్కాహం నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కంచుకోట హనుమాన్ మందిర్‌లో శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం అర్చకుడు మురళీధర శర్మ ఆధ్వర్యంలో 24 గంటల నిరంతర భజన ఎక్కాహం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భజన



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని యాపలగూడ గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రెండు రోజుల పాటు కృష్ణుడికి భజన కార్యక్రమాలు నిర్వహించారు. విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేసినట్లు తెలిపారు. పొలాల అమావాస్య సందర్భంగా ఏటా గ్రామంలో భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లకి ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అంకులు, పాపయ్య, రావుజీ, శంకర్, నెహ్రూ, ధర్మయ్య, లాల్‌బహదూర్, ప్రేమ్‌కుమార్, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి సేకరణ

కాగజ్‌నగర్‌రూరల్: నా మట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని చింతగూడ గ్రామంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లెండుగురే శ్యాంరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ మట్టి సేకరించారు. ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి కలశయాత్ర నిర్వహించారు. మండల ఇన్‌చార్జి ముత్తు అశోక్‌కుమార్, గోపి, శ్రీహరి, హలంచు, సంతోష్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పోషకాహారం!

- కొనసాగుతున్న పోషణ్ మాసోత్సవం
- గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు
- బాలికలకు కిశోరామృతం పంపిణీ
- వాంకిడి ప్రాజెక్టులో ఐదు క్లస్టర్లు

గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారుల్లో పోషకస్థితిని మెరుగుపర్చాలనే లక్ష్యంతో అధికారులు జిల్లా వ్యాప్తంగా పోషణ్ మాసోత్సవాన్ని చేపట్టారు. పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. ఇందుకు మాసోత్సవాన్ని పోషణ్ అభియాన్ పేరుతో ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నారు.

– కెరమెరి



కెరమెరిలో కొనసాగుతున్న పౌష్టికాహార ప్రదర్శన

వాంకిడి ప్రాజెక్టులో..

జిల్లాలో అనేక మంది గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారులు పోషకాహారం లోపంతో బాధపడుతున్నారు. వీరికి పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. వాంకిడి ప్రాజెక్టులో కెరమెరి, వాంకిడి మండలాలు ఉండగా, వాంకిడి, కనర్‌గాం, ఇందాని, కెరమెరి, గోయగాం, కరంజివాడ, మోడి క్లస్టర్లు ఉన్నాయి. మొత్తం 163 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 24 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 119 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేస్తున్నారు. కిశోరబాలికలు 2711 మంది, బాలింతలు 642, గర్భిణులు 810, చిన్నారులు 8070 మంది ఉన్నారు. వాంకిడి ప్రాజెక్టుకు మొత్తంగా 8409 కిశోరామృతం ప్యాకెట్లు మంజూరయ్యాయి.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా..

సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనమే లక్ష్యంగా ప్రాజెక్టుల్లో నెలరోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు 30తో ముగియనున్నాయి. వీటిలో పోషకాహారంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. విటమిన్లు, ఐరన్ సంమృద్ధిగా ఉన్న పాలు, నూనె, అయోడిన్ ఉప్పు తీసుకోవాలని, వైద్యులు సూచించిన కాల్షియం మాత్రలు వేసుకోవాలని, శుభ్రమైన నీటిని తాగాలని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న అంశాలు..

- ప్రసవానికి ముందు కనీసం నాలుగుసార్లు గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి.
- వంట చేసే ముందు, పిల్లలకు ఏదైనా తినిపించే ముందు, భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- బిడ్డపుట్టిన మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించాలి. బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలే ఇవ్వాలి. బిడ్డకు ఆరుమాసాల తర్వాత ఇతర ఆహారం ఇవ్వాలి.
- ఐదు సంవత్సరాల వరకు టీకా పట్టిక ప్రకారం అన్ని టీకాలు వేయించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రాజెక్టులోని ఐదు క్లస్టర్లలో పోషక మాసోత్సవం నిర్వహిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు తీసుకునే పౌష్టికాహారం, రక్తహీనత నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. కిశోర బాలికలకు కిశోరామృతం పంపిణీ చేస్తున్నాం. అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

– రెటిక, ఐసీడీఎస్ సీడీపీవో, వాంకిడి

'స్వచ్ఛత'పై అవగాహనేది..?



గుండాయిపేట పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- మొక్కుబడిగా సచ్ఛత పక్షోత్సవాలు
- ఈ నెల 15వరకు నిర్వహణ
- పట్టించుకోని అధికారులు
- సమ్మెలో సమగ్రశిక్ష ఉద్యోగులు

కౌటాల: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వం ఏటా స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు పక్షోత్సవాలు జరుపుతున్నారు. విద్యార్థులకు సమాజంపై బాధ్యత, స్వచ్ఛతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా రోజుకో కార్యక్రమం చేపడుతున్నారు.

మొక్కుబడిగా..

మండలంలో మొత్తం 54 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 3500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించడం, మొక్కలు నాటించి హరిత చైతన్యాన్ని పెంపొందించడం, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం ప్రధాన అంశాలుగా ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా కొన్ని పాఠశాలల్లో మొక్కుబడిగా కార్యక్రమాలు జరిపిస్తుండడంతో ప్రభుత్వ ఉద్దేశం అమలు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చేపడుతున్న కార్యక్రమాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాలస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికితీస్తున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు స్వచ్ఛత ప్రతిజ్ఞ, హరిత దినోత్సవం, స్వచ్ఛతా పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. 11న వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం, 12న సమాజ భాగస్వామ్యం, 13, 14న స్వచ్ఛతపై ప్రణాళికలను విద్యార్థుల ద్వారా సిద్ధం చేయించనున్నారు. 15న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేసే కార్యక్రమం ఉండనుంది. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా కేవలం ఒకేరోజు అవగాహన, వ్యాసరచన, ఉపన్యాస, చేతులను శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 14 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవోలు, ఈఐఆర్పీలు, మెసెంజర్లు మొత్తం 8మంది సమ్మెలో ఉన్నారు. దీంతో స్వచ్ఛతా పక్షోత్సవాలను నామమాత్రంగా చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి.

'మంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలి'



మాట్లాడుతున్న పెరక శ్రీకాంత్

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికులకు సమ్మె తాత్కాలిక విరమణ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని, జీవో 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పంచాయతీ కార్మికులు 34 రోజులుగా చేపట్టిన సమ్మెను మంత్రి హామీతో తాత్కాలికంగా విరమించినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని విమర్శించారు. నాయకులు రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ఆసిఫాబాద్: రజక సంఘం ఆధ్వర్యంలో..



రెబ్బెన: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని బజార్‌వాడలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేములవాడ గణపతి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. నాయకులు పాడుపుగంటి పుల్లయ్య, వేములవాడ శంకర్, కొండయ్య, హరీశ్, తిరుపతి, కొండ్ర రాజేశ్వర్, పిప్పిరి సాయి, శ్రీకాంత్, సమ్మన్న పాల్గొన్నారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు గేడేకర్ సంతోశ్ కుమార్, పీటీఐ అధ్యక్షుడు రమేశ్, సీఆర్పీ నాయకులు మహేశ్, తిరుపతి, దేవేందర్, రాజేశ్, లులుజీ, శ్యాంసుందర్, నాన్‌టీచింగ్ సిబ్బంది తిరుమల, మమత పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కొండ్ర నరేందర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రజక సంఘం మండల అధ్యక్షుడు నల్లూరి జగదీశ్ పిలుపునిచ్చారు. ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని కుమురంభీం భవన్ వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం నాయకులు అరుణ్, దుర్శెట్టి మహేశ్ తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గోలేటిలో ఆదివారం రజక యువజన సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అన్నారు. రజక యువజన సంఘం నాయకులు ఓరుగంటి రంజిత్‌కుమార్, రాచకొండ రాజశేఖర్, మల్రాజు రవి, వినయ్, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ ఎంపీటీసీ సురేందర్ రాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభాకర్, పోషన్న, రవి తదితరులు పాల్గొన్నారు.



తిర్యాణి: నివాళులర్పిస్తున్న నాయకులు



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: జవాన్
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: జవాన్

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
దొండకాయ	80
మిర్చి	80
సోరకాయ	80
చిక్కుడు కాయ	80
గోబి(పూల్)	80
క్యాబేజ	60
బోడకాకరకాయ	150
చామగడ్డ	80
పొట్లకాయ	100

-ఆసిఫాబాద్‌అర్బన్

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రమణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఆరెగూడ గ్రామ సమీపంలో సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన నాగేందర్, సాయినాథ్‌లు అనే ఇద్దరి వ్యక్తులు 3 క్వింటాళ్ల 5కిలోల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

బెజ్జూర్: ఆయా పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు హైదరాబాద్‌లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, సీనియర్ నాయకులు దుబ్బుల జనార్దన్, చింతలమానెపల్లికి చెందిన సీనియర్ నాయకులు చౌదరి రాజన్న, కాగజ్‌నగర్ మాజీ సింగిల్‌విండో చైర్మన్ దెబ్బటి జలపతిలు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, ఉపాధ్యక్షుడు ఈర్ల విశ్వేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, సత్యనారయణ, శ్రీమన్నారాయణ, కిషోర్, రామకృష్ణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా టీఫైబర్ పనులు



దహెగాం మండలంలోని లగ్గాం గ్రామ సమీపంలో కొనసాగుతున్న టీఫైబర్ పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. రోడ్డును ఆనుకొని తవ్వకాలు చేపడుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తవ్విన చోట మట్టిపోసి వదిలేస్తుండడంతో వర్షం కురిసినప్పుడు వాహనాలు దిగబడే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు దూరంగా టీఫైబర్ లైన్ వేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– దహెగాం

మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న ఆదివారం ప్రారంభించారు. అంతకు ముందు హిందూ, ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధధర్మాల ప్రకారంగా కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ నిర్వహించిన హోమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జోనల్ మీట్ పోటీలకు ఎంపిక

తిర్యాణి: మండలంలోని మంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జోనల్ మీట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లచ్చు ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు మహేశ్, ఈశ్వర్, శివప్రసాద్ ప్రతిభ చూపారన్నారు. అండర్- 14 విభాగంలో నిర్వహించే జోనల్ మీట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ శ్రీనివాస్, రంజిత్ ఉన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన



హనుమాన్ మూల విరాట్టు

ఆసిఫాబాద్: మండలంలోని బాబాపూర్‌లో కొత్తగా నిర్మించిన ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు నిమ్మకంటి సంతోశ్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తి గీతాలతో ఎక్కాహ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.